క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 45 , బెండ 40, కాకర 40, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 45, కీర 30, బీర 40, వంకాయ 50, గోకర 40, బీన్స్ 90, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 80, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20–30, అల్లం 150, వెల్లుల్లి 160.

గణేషుడికి బెల్లం అభిషేకం



రాయదుర్గం: గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో మంగళవారం సంకష్ట చవితిని పురస్కరించుకొని గణేషుడికి బెల్లంతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కృత్తిక నక్షత్రంను పురస్కరించుకుని సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, భక్తులు పాల్గొన్నారు.

ప్రొ.సెంథిల్‌కుమార్‌కు జేసీ బోస్ ఫెలోషిప్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌కు జేసీ బోస్ ఫెలో ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు (2023)ను పొందారు. హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ సెంథిల్‌కుమార్ ఫిష్ మాలిక్యులర్ ఎండోక్రినాలజీ, రీప్రొడక్టివ్ బయాలజీ పరిశోధనా విభాగంలో అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా ఫెలోషిప్ లభించింది.

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీరే ధ్యేయం

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి/రాయదుర్గం: మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం మిషన్ భగీరథ అని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నల్లగండ్లలోని అవంతిక హోమ్స్, గోపన్‌పల్లితండాలో జలమండలి ఆధ్వర్యంలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టే మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జలమండలి అధికారులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటి సరఫరా ప్రభుత్వ లక్ష్యమన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నల్లగండ్ల అవంతిక హోమ్స్, గోపన్‌పల్లితండాలో ఎన్నో ఏళ్ళుగా తీరని సమస్యగా ఉన్న మంచినీటి సమస్య పరిష్కారమైందన్నారు. నెలకు 20వేల లీటర్ల ఉచిత మంచినీటి పథకంపై ప్రతిఒక్కరికీ విస్తృతంగా అవగాహన కలిపించాలన్నారు.నియోజకవర్గంలో కొత్తగా 18 రిజర్వాయర్లు నిర్మించామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో మంచినీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అభిషేక్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో గద్దర్ కాంస్య విగ్రహం

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు: తొలి,మలి దశ తెలంగాణ పోరాటాలలో కీలక భూమిక పోషించడంతోపాటు తన పాటలతో తెలంగాణ జాతిని ఏకం చేసిన మహోన్నత వ్యక్తి, ప్రజా యుద్ధనౌక గద్దర్ 11 అడుగుల కాంస్య విగ్రహంను త్వరలో ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సొంత నిధులతో పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో 11 అడుగుల గద్దర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయబోతున్నారు. త్వరలో మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నట్లు మంగళవారం ఎమ్మెల్యే తెలిపారు.

నియామకం

● యువజన కాంగ్రెస్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్‌గా కవి రాజు

మియాపూర్ : యువజన కాంగ్రెస్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్‌గా మదీనగూడ దీప్తీశ్రీనగర్‌కు చెందిన కవి రాజు నియమితులయ్యారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివాసేనారెడ్డి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడంతో పాటు పార్టీ విధానాలు, సిద్ధాంతాలు ప్రజల వద్దకు తీసుకువెళ్లడంలో కవిరాజు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి, మీడియా చైర్మన్ శైలేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు.

అవగాహన కల్పిస్తున్నా మార్పు ఏదీ..?



న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద పేరుకుపోయిన చెత్త



మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల నుంచి వెళ్ళే నాలా పక్కన చెత్త చెదారం

- న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద గుట్టలుగా చెత్త చెదారం
- బస్తీల్లో అధికారులు అవగాహన కల్పిస్తున్నా తీరు మారదాయే..
- రైల్వే ట్రాక్ పక్కన రాత్రి సమయాల్లో అసంఘటిత కార్యకలాపాలు

హఫీజ్‌పేట్ : న్యూహఫీజ్‌పేట్ రోడ్లు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. న్యూహఫీజ్‌పేట్ ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ బస్తీలకు మధ్య ఉన్న జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద చెత్త గుట్టలుగుట్టలుగా పేరుకుపోయింది. ఈ ప్రాంతమంతా దుర్వాసన, దుర్గంధం వెలువడుతోంది. పరిసరాల శుభ్రత...స్వచ్ఛభారత్ నినాదంతో వివిధ కార్యక్రమాలు చేపట్టిన జీహెచ్ఎంసీ అధికారులు బస్తీలలో నిత్యం పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. చెత్తను ఆటోలకు ఇవ్వకుండా రోడ్లపై,మురుగు కాలువల్లో పారబోస్తుండడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇక ఫ్లైఓవర్ కింద, హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ ఆనుకొని రాత్రి సమయాలలో అసంఘటిత కార్యక్రమాలు జరుగుతున్నాయని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ◆ స్థానికులు చెత్తను చెత్త ఆటోలకు ఇవ్వకుండా రోడ్లపైనే వేస్తున్నారు.
- ◆ పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయకపోవడంతో గుట్టలుగా పేరుకుపోతుంది.
- ◆ రోడ్లపై, మురుగు కాలువలో చెత్త వేయడం మురుగునీరు రోడ్లపైకి వస్తోంది

తీసుకోవాల్సిన చర్యలు..

- ◆ న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద చెత్త చెదారం వేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- ◆ నాలాలో చెత్త వేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి
- ◆ చెత్త వేసే చోట శుభ్రం చేసి మొక్కలు నాటి బస్తీ వాసులకు అవగాహన కల్పించాలి
- ◆ రోడ్లపై చెత్త వేసేవారిపై చర్యలు తీసుకోవాలి
- ◆ ఫ్లైఓవర్ కింద పోలీస్ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

దుర్గంధం భరించలేకపోతున్నాం



న్యూహఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద రోజుల తరబడి చెత్త చెదారం పేరుకుపోవడంతో ఇటువైపు వెళ్ళాలంటే ఇబ్బందిపడుతున్నాం. దుర్గంధం హరించలేకపోతున్నాం. మురుగు నీటి కాలువలో చెత్త పోస్తున్నారు. అధికారులు చెత్తను చెత్త ఆటోకు ఇచ్చే విధంగా బస్తీలలో అవగాహన కల్పించాలి. చెత్త ఆటోలలో వేయని వారిపై చర్యలు తీసుకోవాలి.

–గౌస్, ఆదిత్యనగర్

పోలీసులు నిఘా ఉంచాలి



హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ మొదలు ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ వరకు రాత్రి సమయాలలో కొంతమంది యువకులు గంజాయి తాగుతున్నారు. పోలీసులు వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలి. కార్డన్ సెర్చ్‌లో కూడా ఈ విషయాలను పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాం. స్పందించాలి.

– సలీం, ప్రేమ్‌నగర్

అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



నల్లగండ్ల హుడా కాలనీలో వంద ఫీట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు

- ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ
- నల్లగండ్ల హుడా కాలనీలో రూ.7.65 కోట్లతో వంద ఫీట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో రూ. 7.65 కోట్లతో నిర్మించనున్న వంద ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాలతో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు పూర్తి అయితే గచ్చిబౌలి, నానక్‌రాంగూడ వంటి ప్రాంతాల్లో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. బీటీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, బీఆర్ఎస్ నాయకులు రాజుయాదవ్, రవీందర్‌గౌడ్, కాలనీ వాసులు మధుసూదన్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, చెన్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలలో స్వచ్ఛభారత్



కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

హఫీజ్‌పేట్ : మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకొని చందానగర్ మహిళ దక్షత సమితి విద్యాసంస్థలు సుమన్ జూనియర్, ఒకేషనల్ కళాశాల, బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, వి.డి.బజాజ్ డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ ఎఫిషియెన్సీ కమిటీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్, ఇంటర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమాకుమారి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుశీలా పాటిల్, ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు కలిసి హాస్టల్ పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యమన్నారు .కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కానుకుంటలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): మారుమూల గ్రామాలు, తండాలు అభివృద్ధిపథంలో ముందుకు సాగుతున్నాయని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిల్లో రూ.12.30 కోట్ల అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన నాయకులు ఆయన్ని సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన గుమ్మడిదల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీన, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ మంజుల, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, హుస్సేన్, ప్రభాకర్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్, వెంకటేశ్వరనగర్‌లోని 33, 34 బ్లాక్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే గాంధీ సీడీపీ నిధులురూ. 9 లక్షలతో 70 కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే గాంధీ, సీఐ క్రాంతి కుమార్, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కాలనీల్లో నేరాలు అరికట్టడానికి సీసీ కెమెరాలు తోడ్పడతాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ తీసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, నేర శోధన, నేర నివారణకు ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కళ్ల జోడు అందిస్తున్న సంస్థ చైర్మన్ భిక్షపతి యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరనగర్‌లోని పీజేఆర్ కమిటీ హాలులో మంగళవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందజేశారు. సంస్థ చైర్మన్ ఎం.భిక్షపతి యాదవ్ పాల్గొని కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ విద్యాకల్పన, డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, జిల్లా ఎస్‌సీ మోర్చా సెక్రటరీ అశోక్, డివిజన్ నాయకులు గోపాల్‌రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మనోజ్, డివిజన్ సెక్రటరి జితేందర్, దయాకర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మార్ల శ్రీను, బొట్టు శ్రీను, మహిళా మోర్చా నాయకులు సంధ్య, శృతి గౌడ్, మమత, శాలిని, బస్తీవాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలతో బీజేపీ నాయకులు

మద్దతు తెలిపిన బీజేపీ నాయకులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు నిరసన తెలిపారు. వారికి బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మూల అనిల్‌గౌడ్, బీజేపీ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 23 రోజులుగా నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు.కార్యక్రమంలో బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు నక్కశివకుమార్, నాయకులు విష్ణు, రావుకోలు ప్రవీణ్‌కుమార్, శ్రీలత, సువర్ణ, ఎస్కే రాణి రూప, సునీత, స్వప్న, నాగమణి పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న గుజరాత్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మంగళవారం కిరణ్మయూరి కళా నిలయం గురువు దేశరాజు కిరణ్మయి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. కళాకారులు తన్మయి, సంహృత, రజని, లిఖిత, సహస్ర, జాహ్నవి, సాత్విక, నిశిత, చరిష్మా ప్రదర్శించారు.



విద్యుదాఘాతంతో మేస్త్రీ మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ షాక్‌తో మేస్త్రి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...ఛత్తీస్‌గఢ్‌కి చెందిన సునీల్‌కుమార్ సాహూ(30) బ్రతుకుతెరువు కోసం మూడు సంవత్సరాల క్రితం అమీన్‌పూర్ పరిధిలోని కృష్ణనగర్‌లో ఉంటూ, మేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మధురానగర్ కాలనీలో బెల్లంకొండ మాల్యాద్రి అనే కాంట్రాక్టర్ పనిచేసేందుకు సునీల్‌కుమార్‌ను పిలవగా అతడు ఆ భవనం వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి సునీల్ కుమార్ ఇనుప రాడ్‌లను పైకి తీసుకెళ్తున్న క్రమంలో మొదటి అంతస్తుకు రాగానే పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు ఇనుపరాడ్ తగిలి షాక్ కొట్టింది. కింద పడిపోవడంతో వెంటనే చికిత్స కోసం అశోక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లేబర్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా కారణంగా సునీల్ కుమార్ మృతిచెందాడని మృతుడి బంధువు కీర్తన్ సాహూ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ట్యాబ్స్, ల్యాప్‌టాప్స్ అందజేత



మాదాపూర్: సినీ గాయని స్మిత ఫౌండర్‌గా వ్యవహరిస్తున్న అలయ్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ట్యాబ్స్, ల్యాప్‌టాప్‌లను ఉచితంగా అందజేశారు. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అతిథులుగా సినీ హీరోలు నాని, అడవిశేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 400 మంది విద్యార్థులకు ట్యాబ్స్ అందజేసినట్టు తెలిపారు. స్మిత మాట్లాడుతూ విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లలో 20 సబ్జెక్టులు ఉంటాయని తెలిపారు.

రేపు ప్రగతి నివేదన సభ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 45 రోజుల పాదయాత్ర ముగిసిన సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీలో నిర్వహించనున్న ప్రగతి నివేదన సభకు ముఖ్యఅతిథిగా మంత్రి కేటీఆర్ రానున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. ఫోరమ్‌మాల్ వద్ద సభాస్థలిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 5వ తేదీ సాయంత్రం 4గంటలకు 40 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం ప్రగతి నివేదన సభలో పాల్గొంటారని వివరించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక రూ.వేల కోట్లతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

అభివృద్ధిపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారంలోని ప్రధాన రోడ్డు పనులు వేగంగా చేపట్టాలని, పనులు ఆలస్యం అవుతుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్‌లు పేర్కొన్నారు. బొల్లారం మున్సిపల్ సాధారణ సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధిపై అధికారులు కౌన్సిలర్‌లతో సమీక్షించారు. శిఖం స్థలాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, అనుమతులు లేకున్నా ఇంటి నంబర్లను ఎలా కేటాయిస్తున్నారని కౌన్సిలర్‌లు అధికారులను ప్రశ్నించారు. అనంతరం రూ.25 లక్షల అభివృద్ధి పనులు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కౌన్సిలర్‌లు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. సమావేశంలో దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సంగారెడ్డి, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్వో శ్రీధర్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

నకిలీ మద్యం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్ట్

విదేశీ మద్యం సీసాల్లో తక్కువ రకం మద్యం పోసి అమ్మకం



నిందితులతో శంషాబాద్ అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్

హఫీజ్‌పేట్ : విదేశీ మద్యం సీసాల్లో తక్కువ రకం మద్యం పోసి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన శేరిలింగంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో జరిగింది. శంషాబాద్ అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు...ఒరిస్సాకు చెందిన ఎండీ ఆజామ్ (30), సుశాంత్ (35), సత్య సుందర్ (32) నగరానికి వచ్చి ఈవెంట్‌లలో బార్ అటెండర్‌లుగా పని చేస్తూ అక్కడ తాగి పడేసిన విదేశీ మద్యం ఖాళీ సీసాలు తీసుకువెళ్ళి తక్కువ ధరకు దొరికే మద్యంను ఈ సీసాలలో నింపి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మాదాపూర్, కొండాపూర్‌లలో అక్రమంగా నకిలీ విదేశీ మద్యం అమ్ముతున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న రంగారెడ్డి జిల్లా డేవిడ్ రవికాంత్, డీఏఈఓ శంషాబాద్ సత్యనారాయణ ఆదేశాల మేరకు మాదాపూర్ మెట్రో పిల్లర్ నెంబర్ 1724 వద్ద ఆజామ్ విదేశీ నకిలీ మద్యం సీసాలు తీసుకువెళ్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా మరిన్ని బాటిళ్ళు ఇంట్లో ఉన్నాయని తెలిపాడన్నారు. ఇంటికి వెళ్ళి తనిఖీలు చేయగా 24 బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే తన స్నేహితుడైన సుశాంత్ ఇంట్లో కూడా ఉన్నాయని తెలుపగా వెంటనే కొండాపూర్‌లో వెళ్ళి తనిఖీ చేయగా 22 విదేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా నకిలీ మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి 46 విదేశీ మద్యం సీసాలు, 294 ఖాళీ సీసాలు, కవర్లు, లేబుళ్ళు, ఒక యమహా బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్, డీటీఎఫ్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీనివాస్, వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.